


నా పుట్టిన రోజు. పార్టీ ఏమీ ఇవ్వలేను లెండి. మీరు మనస్సులోనైనా నాకు శుభాకాంక్షలు చెప్పుకుంటారు గదా అనే దురాశతో ఈ విషయం మీ కొక్కరికే తెలియజేస్తున్నాను. తప్పకుండా శుభాకాంక్షలు చెబుతారు కదూ! మళ్లీ ఆదివారం వరకూ, టాటా! ...

ఇట్లు,

—మీ, శ్రేయోభిలాషి.'

ఉత్తరాన్ని పూర్తిచేసిన సుందరి హృదయమంతా బరువెక్కి పోయింది. అనుకోకుండా కళ్లు చెమర్చాయి. శ్రేయోభిలాషెవరో తెలిస్తే ఎంత బావున్ను! పుట్టిన రోజుకి బ్రహ్మాండమైన బహుమతిని ఇచ్చి ఉండేదాన్ని. 'ఈ ఆ రోజు ఎదురువెళ్లి శుభాకాంక్షలు చెప్పి ఉండేదాన్ని. ఆ అవకాశం కలిపించకుండా తనే దూరం చేసుకుంటున్నాడే శ్రేయోభిలాషి! ... ఇకమీదటైనా ఇతనెవరో గుర్తించి తీరాలి!' ఉత్తరాన్ని

మడిచి డైరీలో దాచుకొన్నది సుందరి.

* * *

"ప్రియమైన సుందరిగారికి'

'ప్రియమైన' అని ప్రారంభించినందుకు మరేం కంగారు పడకండి. దానివల్ల మీ కేవిధమైన ప్రమాదమూ లేదు. అవును కదూ? అతి కష్టంగా మళ్లీ శనివారం వచ్చింది. ఎంతో ఉత్సాహంతో ఉత్తరం ప్రారంభించాను. ఇది మీకు రేపు, అంటే —ఆదివారం—ఎక్స్‌ప్రెస్ పోస్ట్‌లో అందుతుంది. ఓపిగ్గా చదువుతారు గదూ? సరేగాని, మొన్న సెప్టెంబర్ పది హేడున నాకు మీరు మీ మనసులోనే శుభాకాంక్షలు చెప్పుకున్నారు కదూ? ఎలా కనిపెట్టేసేనో చెప్పేయమంటారా? ఆ రోజున మీరు నా కిష్టమైన రోజ్ శారీ కట్టుకొని రోజ్‌ను తలలో తురుముకున్నారు. కాంటీన్ దగ్గిరా, లైబ్రరీ దగ్గిరా, బస్‌స్టాప్‌లోనూ తదేకంగా ఎవరి గురించో మీరు అన్వేషిస్తున్నారు. ఆ రోజున ఎవరైనా తలంటుకొని క్రొత్త బట్టలు వేసుకున్నారేమో కనిపెట్టేద్దామని మీ ప్రయత్నం గామోసు! కాని, సుందరి గారూ, ఆ రోజు నేను రోజూలాగా మామూలుగానే ఉన్నాను. ఆ రోజు నాకెంతో ఇష్టమైన పనిమాత్రం సాధ్యమైనన్ని ఎక్కువసార్లు చేసేను. అదే ఆనాటి స్పెషాలిటీ. అదేం పనో తెలుసా? గుండెల్లోనే గుడి కట్టుకుని నే నారాధించే దేవతను ఎన్నోసార్లు దర్శనం చేసుకున్నాను. ఆ దేవత ఎవరో తెలుసా? ... మీరే! పిచ్చిపిచ్చిగా ఏదేదో వ్రాస్తున్నాను కదూ? నిజమే లెండి, ఈ మధ్యన కవిత్వం కూడా మొదలుపెట్టేను. ఇప్పుడే వ్రాస్తే మీరు చదవరేమోనని భయం. అప్పుడప్పుడు తీరిగ్గా వ్రాస్తుంటాను. ఓపిగ్గా చదువుతారు కదూ? పర్మిషన్ గ్రాంటెడ్డా? ... థాంక్స్!

సుందరిగారూ, ఒకటి అడుగుదామనుకుంటున్నాను. అడగనా? ఏమో, నాకు భయమేస్తుంది. తీరా అడిగితే మీకు కోపం వస్తుందేమో! ఎటువంటి కష్టాన్నైనా సహించగలను గాని, నా మూలంగా మీ మనస్సుకు కష్టం కలిగితే మటుకు ఏమాత్రం భరించలేను. 'నా మూలంగా మీకు బాధ కలిగింది' అని తెలిస్తే ఏదైనా ఇంత మింగి చచ్చిపోతాను. అవును, సుందరీ, మీరంటే నాకు అంత అభిమానం! అంతకుమించిన ప్రేమ! వీటన్నింటినీ మించిన ఆరాధన! పోన్లెండి, మళ్లీ ఆదివారం ఉత్తరంలో ఆ విషయం అడుగుతాను. ఓ. కే.

అన్నట్టు నాకు మీరు మనసులో చెప్పుకొన్న శుభాకాంక్షలకు నా కృతజ్ఞతలు అందుకోండి. అందుకున్నారా? థాంక్యూ. ఇక ఉంటా మరి.

—మీ, శ్రేయోభిలాషి."

సుందరి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఏదో వ్యక్తం చేయలేని బాధ! ఏం చేయడానికి వీల్లేకుండా ప్రతిసారీ నిస్సహాయమైన స్థితికి తీసుకువచ్చి వదిలేస్తున్న శ్రేయోభిలాషి మీద తెలియకుండానే అభిమానం, ఆత్మీయతా పుట్టుకొచ్చాయి. 'ఎలా? ఇతనిని చూడడమెలా? అంత సహృదయుంతో రోజు రోజుకూ దగ్గిరై పోతున్న నా శ్రేయోభిలాషిని కళ్ళారా చూడడమెలా? ఎలా? ఎలా? ...' నిస్సహాయంగా తల పట్టుకుని కూర్చుండి పోయింది సుందరి.

* * *

"ప్రియమైన సుందరీ, ఈ సారి నుంచీ మిమ్మల్ని 'నువ్వు' అని సంబోధిస్తాను. ఏమీ అనుకోరు కదూ? భక్తి ప్రపత్తులతో మనం పూజించే దైవాన్ని కూడా 'నువ్వు' అనే అంటుంటాం. అలాగే, అదే భావాలతో హృదయంలో పూజించుకొనే మిమ్మల్ని ఇక మీదట 'నువ్వూ' అనే పిలుస్తాను. ఫర్వాలేదు కదూ? చూడు, సుందరీ, క్రిందటి ఉత్తరంలో నిన్నొకటి అడుగుతానన్నాను కదూ, అడిగేస్తున్నాను. ఏమీ అనుకోకేం? అడిగేయనా? ... ఓ. కే. నీకు వచ్చే అక్టోబర్‌లో వివాహమైపోతుందని విన్నాను. నిజమేనా? మీ ఉడ్—బీ ఐ. ఎ. ఎస్ ఆఫీసరటగా? నిజమేకదూ? చాలా సంతోషం. అది నిజమే అయితే అంతకంటే ఆనందకరమైన విషయం నాకు మరొకటి ఉండబోదు, సుందరీ! నా కిష్టమైన సుందరి పెద్ద ఆఫీసరు భార్య అవుతున్న దంటే, అంతకంటె నాకు కావలసిందేముంది? నేను ఆరాధించుకొనే సుందరి కలెక్టరు భార్యగా ఎన్నో సభల్లో బహుమతులు పంచిపెడుతుంది, ప్రారంభోత్సవాల్లో రిబ్బను కత్తిరిస్తుంది. నా ప్రియాతి ప్రియమైన సుందరి భవిష్యత్తంతా బంగారుమయం! అంతకంటె శ్రేయోభిలాషిగా నా సుందరికోసం నేనేం కోరుకుంటాను? సుందరీ, నీ పెళ్లికి నన్ను గుర్తుంచుకొని ఆహ్వానిస్తావు కదూ? నాకు తెలుసు. నువ్వు నన్ను పిలవాలని మనసులో ఎంతగానో కోరుకుంటావు. నిజంగా పిలిచే దానికంటే, అలా నీ మనసులో నేను రావాలని కోరుకోవడంలోనే నాకెంతో సంతృప్తి లభిస్తుంది.

సరేగాని, నేను వ్రాసిన పిచ్చి కవిత్వంలో కొన్ని లైన్స్ ఇక్కడ వ్రాస్తాను. విసుక్కోకుండా చదువుతావు కదూ?

## చర్చ

ఒక దృఢవిశ్వాసాన్ని ఆమోదించనివాడు చర్చకు అనర్హుడు.

—వాల్టై

"కలలో, ఇలలో,
కల్పనలో,
వెన్నెలలో, చీకటిలో —
యథార్థంలో రోజుకి దేవుడిచ్చిన
ఇరవై నాలుగు గంటలకీ —
మన్నాటి తాలూకు మరో గంటకలుపుకొని.
నిన్ను గురించే ఆలోచిస్తూంటూ,
నీ ఆరాధనలోనే గడుపుతుంటూ,
అందుచేతనే,
నా జీవిత చక్ర మెప్పుడూ —
రోజు కో గంట లేటుగా పయనిస్తుంటుంది!"

* * *

"ఏదో ఆశతో, ఊహతో
ఏదో భ్రాంతితో, తపనతో —
చెట్టుప్రక్కన రాటనై,
నీ దారికి కాపలాదారునై,
నీ వైపు చూస్తుంటూ!
నా చూపు నీ కసహ్యమైతే,
నా ఉనికి సహించలేకపోతే,
చెప్పు నేస్తం,
గుండెల్లో మేకు కొట్టుకొని,
చిప్పిల్లిన రక్తబిందువుల్తో —
నీ రూపు హృదయ ఫలకం మీద
చిత్రించుకొని,
గాలిలో, నీటిలో, మట్టిలో —
నిప్పులో, నింగిలో —
పంచ భూతాలలో —
కలిసిపోతాను!
అప్పటికీ,
నా భూతం నిన్ను వెన్నాడుతుందని
కలవరపడకు నేస్తం !
అదంతా మిథ్య! —
అదంతా —
భౌతికంగా నేను మాయమైనా,
నీ మనసులో నామీది ఏహ్యభావాన్ని,
కలకాలం ఉండిపోయేట్లు చేసేందుకు,
కవులు చేసిన అభూత కల్పన!
ఔనని, నా మాట
నమ్ముతావు కదు నేస్తం? !"

ఇదంతా పిచ్చివాడి ప్రేలాపన లాగున్నది కదు, సుందరీ? నువ్వలానే అనుకుంటే అదే నిజం. ఇంతకీ దీని మీద నీ అభిప్రాయం ఏమిటో? ఏదైతేనేంలే, మంచి అయినా, చెడ్డ అయినా నీ అభిప్రాయమే నా అభిప్రాయం. బోరు ఫీలవుతున్నావ్ కదూ? సారీ, ఇక ఉంటా.

—నీ, శ్రేయోభిలాషి."

మనస్సంతా వికలమై పోయింది సుందరికి. నిస్సహాయంగా ఉత్తరం వైపు చూస్తూ 'ఎందుకు, శ్రేయోభిలాషీ, నువ్వెవ్వరివో తెలియజేయకుండా నన్నిలా చిత్రవధ చేస్తావు?' అనుకొంటూ తల కిటికీ కేసి కొట్టుకొన్నది సుందరి.

* * *

"నా ప్రియాతిప్రియమైన సుందరీ, ఈ మధ్య నువ్వెందుకో దిగులుగా ఉంటున్నావు. కొంపదీసి దానికి కారణం నేను కాదు కదా? నేను నీ కొక ప్రాబ్లెంనై కూర్చోలేదు గదా? చెప్పు సుందరీ, నేను నీ కొక ప్రాబ్లెంనైతే, నీ కొక 'హెడేక్' నైతే, 'న్యూసెన్స్' నైతే నవ్వుతూ నీ ప్రాబ్లెం సాల్వ్ చేస్తా. అమృతాంజనం లేకుండానే నీ హెడేక్ మాయం చేస్తా. క్షణాల్లో న్యూసెన్స్ క్లియర్ చేస్తా. ఎలాగని మాత్రం అడగకు, సుందరీ! అదంతా నా చేతిలోపని. నీ చిరునవ్వుకోసం ఏమైనా చేస్తా. నువ్వెప్పుడూ నవ్వుతూనే ఉండాలి సుమా! అన్నట్టు నీ చిరునవ్వుమీద 'మిలియన్ డాలర్ స్మైల్' అని నాలుగు పంక్తులు పిచ్చి కవిత్వం వ్రాసేను. చూడు —

"నీ చిరునవ్వు ఖరీదు
మిలియన్ డాలర్లైతే —
నేను కొనలేను నేస్తం!
నీ చిరునవ్వు ఖరీదు
మిలియన్ బిలియన్ల
రక్త కణాలైతే —
శిరలనూ, ధమనులనూ
పెనవైచి,
గుండెను పిండి,
రక్తాన్ని ప్రోగుజేసి,
ఎరుపు, తెలుపు కణాలను వేరుజేసి,
లెక్కగట్టి,
నీకు జమకట్టి,
నీ చిరునవ్వుకు వెల కడతా!"

'భేష్, బావుంది!' అని మెచ్చుకుంటున్నావ్ కదూ? అదంతా నా మీది అభిమానం మూలంగానేలే! నిజంగా బాగుంటుందేమిటీ పిచ్చివాడి కవిత?

అన్నట్టు, సుందరీ, నువ్వు నిన్నరాత్రి నాతో ఎంతో సేపు మాట్లాడేవు. ఎక్కడో తెలుసా? ఊహాలోకంలో! అదే, కలలో! కలలో 'సుందరి' ఎంతమంచిదనుకొన్నావ్? నీ కంటె కొన్ని వేలరెట్లు మంచిది. నన్నుచూడగానేనవ్వుతూ ఆగిపోయి, 'హలో—' అంటూ నా పేరు పెట్టి ఎంతో తియ్యగా పిలిచింది. ఎన్నో గంటలు ఏమిటేమిటో మాట్లాడింది. 'మళ్లీ రేపు వస్తా'నని ఒట్టు

కూడా వేసింది. ఆ 'రేపు' కోసం ఎదురు తెన్నులు చూడడంతో అసలు నాకు నిద్రే రాలేదు. నిద్ర రాకపోతే కల రాదు. కల రాకపోతే నా సుందరి రాదు. సుందరి రావాలంటే కల రావాలి! కల రావాలంటే నిద్రపోవాలి, నిద్రరావాలి! నిద్రరావాలంటే ఏం చేయాలో తోచక కొట్టుకుంటుంటే, నా మెడికల్ స్నేహితుడు ఓ మంచి ఉపాయం చెప్పేడు. అప్పటి నుంచీ హాయిగా నిద్ర పడుతున్నది. రోజూ కల వస్తున్నది. సుందరి రోజూ కలల్లో కొచ్చి మాట్లాడి వెళ్ళిపోతున్నది. ఆ సుందరి ఎంత మంచిదో నీకేం తెలుసు? నా ఊహా సుందరిని నీకు చూపించాలని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. తను ఎలా గుంటుందో, ఎంత మంచిదో చూసే వంటే నువ్వు నిజంగా అసూయ పడతావు! పోనీ, నీ రూమ్‌కి నా సుందరిని పంపమంటావా? అసూయతో, ఈర్ష్యతో ఆమెను అవమానించకూడదు సుమా? ఒట్టేనా? ... నిజంగా నా సుందరిని నీ వద్దకు పంపనా? ... సరే, అయితే ఇప్పుడే నా సుందరి నీ రూమ్‌కి వచ్చేస్తున్నది. ఆశ్చర్యపోకు! వెళ్ళి రిసీవ్ చేసుకో! నువ్వు చిరునవ్వుతో ఆమెను ఆహ్వానించాలి! అప్పుడే తనూ చిరునవ్వు చిందిస్తుంది! నువ్వు అసూయతో ఆమె వైపు కోపంగా చూస్తే, తనూ అంత కంటే చిరాగ్గా నీ వైపు చూస్తుంది. అందుచేత ఆమె విషయంలో అన్ని విధాలా జాగ్రత్త వహించు! సరేనా? అయితే నీ రూమ్ తలుపులు తీసి ఉంచు. నువ్వు తిన్నగా వెళ్ళి నీ గదిలో ముస్తాబై, తిలకం దిద్దుకో! నీ ముందు అద్దంలో అవతలి వైపు కనబడే సుందరే నా సుందరి! ఆమె నాది! నీ కంటె నా సుందరి ఎన్ని వేల రెట్లు అందమైనదో చూసి చెబుతావు కదూ? కనీసం ఊహలో నైనా ఆమెతో జీవించాలని నా ప్రయత్నం. అది తప్పుకాదు కదూ? శెలవా మరి? ...

—నీ, శ్రేయోభిలాషి."


ఉత్తరం చదువుతూనే అనుకోకుండా వెళ్ళి అద్దం ముందు నిలుచున్నది సుందరి. 'అవును, కలలో మనుషులూ, సుందరులూ ఎంతో మంచి వాళ్ళు! వాళ్ళకే అద్దంకులూ ఉండవు. యథార్థంలోనే మనుషులు క్రూరమైన వాళ్ళు! నిజంగా నేను చెడ్డదాన్ని. క్రూరమైన దాన్ని. కళ్ళుండీ నిన్ను చూడలేక పోతున్నాను. మనసుండీ నీతో మాట్లాడలేక పోతున్నాను. నన్నెందు కిలా శిక్షిస్తున్నావు, శ్రేయోభిలాషీ!' — చీర అంచుతో కళ్ళు ఒత్తుకున్నది సుందరి.

"నా ప్రియాతిప్రియ సుందరీ, నిన్నిలా పిలవడం బహుశ నే ఆఖరి సారి కావచ్చు. ఎందుకంటే కారణం నీకు తెలుసు! రేపు అక్టోబర్‌లో నీ వివాహం అయిపోతుందని విన్నాను. ఓ వారం రోజులలో పెళ్ళి నిమిత్తమై మీ ఊరు వెళ్ళిపోతున్నావని కూడా విన్నాను. వివాహ మయ్యేక మీవారు ట్రెయినింగ్‌కు వెళ్ళిపోతారనీ, నువ్వు చదువు పూర్తిచేసేందుకు తిరిగి వస్తావనీ కూడా విన్నాను. సుందరీ, నిన్ను వధువుగా కళ్ళారా చూడాలనీ, నా కంటె వయసులో మాత్రం చిన్న దానివి గనుక అక్షింతలు వేసి, ఆశీర్వదించి, తరవాత గౌరవ భావంతో హృదయపూర్వకంగా నమస్కరించాలనీ ఎంతో కోరికగా ఉన్నది. కాని అంతటి అదృష్టానికి నాలాంటి వాడు నోచుకోడని నాకు తెలుసు. నన్నాహ్వానించాలని నీ మనసు కోరుకోవచ్చు. నిజంగా నే నెవరో తెలిస్తే, తప్పకుండా పిలుస్తావు. కాని, నన్నిలా ఇప్పుడూ, ఎప్పుడూ, ఎల్లప్పుడూ గుప్తంగానే ఉండిపోనీయ్. నే నెప్పుడూ నీ శ్రేయోభిలాషినే! వధువుగా నిన్ను నా ఊహాలోనే చూసుకొని, నీ వివాహం నాడు మనసులోనే నీకు శుభాకాంక్షలు చెప్పుకొని, శ్రీమతిగా నువ్వు తిరిగి వచ్చే శుభదినం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటాను. ఈ లోగా నన్ను —

"గుర్తుంచుకో నేస్తం
గుర్తుంచుకో!
నిన్నారాధించే అభాగ్యునిగా కాకపోయినా,
పూజించే పుష్పంలా కాకపోయినా,
ఎలాగోలాగ,
గుర్తుంచుకో నేస్తం, గుర్తుంచుకో!
భయంతో, భక్తితో,
ప్రేమతో, నమ్రతతో,
ఊహాలో,
నీకు సమర్పించుకొన్న
గులాబిలా కాదు;
దాని ముల్లులానూ కాదు,
దానికి సృష్టినిచ్చిన,
గులాబి అంటు నిల్చొన్న చోట,
ప్రోగైన కోటాను కోట్ల
ఇసుక రేణువుల్లో,
ఒకటిగా—
కనీసం ఊహాలో నైనా,
గుర్తుంచుకో నేస్తం —
గుర్తుంచుకో!
ప్లీజ్, ఫర్గెట్ మీ నాట్! !"

—ఇట్లు, నీ, శ్రేయోభిలాషి.'

బరువుగానిట్టూర్చి, సూట్‌కేస్‌వద్దకు వెళ్ళింది సుందరి. 'వచ్చినా, రాకపోయినా ఈ మొదటి శుభలేఖ నా శ్రేయోభిలాషికి!' అనుకొంటూ శుభలేఖల కట్ట నుండి ఒకటి తీసి—"నా శ్రేయోభిలాషికి, ఫ్రమ్ నీ— సుందరి!" అని వ్రాసి, అద్దం ముందు నిలుచుండి పోయింది సుందరి.



అస్తమించిన ఆంధ్ర పితామహుడు
శ్రీ మాడపాటి హనుమంతరావుగారు

* * *

"పూజ్యురాలైన శ్రీమతి సుందరి గారికి, నిన్న మిమ్మల్ని చూసేసరికి కలో, నిజమో తెలీక కంగారు పడ్డాను. పూర్వపు సుందరికీ, నిన్న నేను చూసిన సుందరి గారికీ ఎంత తేడా! ఇన్నాళ్ళూ రోజూ లాగానే సూర్యు డుదయించే వాడు, రోజూ లాగానే చీకటి పడేది. చంద్రుడు వచ్చేవాడు. సముద్ర కెరటాలు ఆనందంతో ఉప్పొంగి పోయేవి. కాని, ఇన్నాళ్ళూ, రోజూ నాకు కనబడే దేవత దర్శనభాగ్యం మాత్రం కలగలేదు. నిన్న మళ్ళీ నా జీవితంలో ఒక మరపురాని రోజు. ఇన్నాళ్ళు నా దేవతని చూడకుండా ఎలా జీవించి ఉండగలిగేనని మీకు ఆశ్చర్యంగా లేదూ? సుందరిగారూ, నా దేవత మనసులో లేని క్షణం ఒక్కటీ నాకు తారస పడలేదు. ఆమెను ప్రేమించడం మరిచిపోయి, గౌరవించడం నేర్చుకొంటూ ఆమె ఆరాధన లోనే రోజులన్నీ గడిపాను. ఊహాలోనే నా సుందరితో ఇన్నాళ్ళూ జీవించాను. కాని, ఊహాకీ, యథార్థానికీ పొత్తు కుదరక, మానసికంగా చిత్రవధ ననుభవించాను. నా కిక మనసు లేదు. అది ముక్కలు ముక్కలై పోయింది. ప్రతి ముక్కలోనూ నా సుందరి రూపం ప్రతిఫలిస్తున్నది. నా కళ్ళలో నీరు లేదు. అదెప్పుడో ఇంకిపోయింది. ఇప్పుడు ఏడుపొస్తే కన్నీరు కారదు — దాని స్థానంలో రక్తబిందువులు స్రవిస్తాయి! నా ఊహ నన్ను కాల్చి వేస్తున్నది. యథార్థం నన్ను చిత్రహింస చేస్తున్నది. నన్నేం చెయ్య మంటారు, సుందరీ? ఉఫ్, ఇదే ఆలోచనలతో పిచ్చిపిచ్చిగా ఏదో వ్రాసేను— చదివి, నవ్వేయండి సుందరీ —

"పోమ్మను, పోతా!
చచ్చిపొమ్మను, చచ్చిపోతా!
ఈ జన్మలో —
ఈ ఇలలో —
యథార్థంలో —

ప్లీ,

వా,

స్నేహానికి తావులేదు.

అందుకే,

పోతా, చచ్చిపోతా!

అవును, మరో జన్మలో —

ను వ్వభిమానించి,

ప్రేమతో నిమిరి,

స్నేహపు జల్లులో తడిపే,

నీ పెంపుడు కుక్కపిల్లలా,

జన్మించాలని కోరుకుంటూ

అదే ప్రయత్నంలో —

ఆనందంగా — హాయిగా

పోతా, చచ్చిపోతా!

చూడు నేస్తం,

పొరబాటున, క్షణకాలం

నీ కాటుక కళ్లలో పడిన

ధూళికణం మూలంగా

చిప్పిల్లిన నీటిబిందువులో —

ఒక్క కణాన్ని మాత్రం

నా కోసం వెచ్చించి,

నన్ను పొమ్మను నేస్తం,

చచ్చిపొమ్మను!

ప్లీజ్, లెట్ మీ డై."

నిజంగా గాని నన్ను చచ్చిపొమ్మనరు గదా, సుందరీ? ఒక వేళ మీరు కోరినా చావు అంత సులభంగా వస్తుందా ఏమిటి? అందులోనూ పేదవాళ్లకి! అదేమిటో అదృష్టదేవతకీ, మృత్యుదేవతకీ కూడా పేదరికం అంటే చిన్న చూపే! ఇద్దరూ వాళ్ల జోలికే రారు. చూడండి, సుందరీ, నాదొక చిన్న కోరిక. మన్నిస్తారుకదూ! మీకు పెళ్లి కానుకగా ఏదైనా పంపించాలని మనసు ఉవ్విళ్లూరుతున్నది. కనీసం ఇటువంటి కోరికనైనా నేను తీర్చుకో వచ్చుగా! పంపించినపుడు మన్నించి అంగీకరించండేం? నాకు మొన్ననే పూర్ స్టూడెంట్స్ స్కాలర్‌షిప్ వచ్చింది. దానితో మీకు, నాకు అంతస్తు అంటూ లేకపోయినా, మీ అంతస్తుకూ, హోదాకూ తగిన బహుమతిని ఈయ గలిగే తాహతును దేవుడు అనుకోకుండా కల్పించాడు. దయచేసి మన్నించండి. నా ఈ చిత్రమైన పరిచయాన్ని ఓ పీడ కలగా భావించి మరిచిపోండి. నా సంతృప్తి కోసం నేను పిచ్చిగా వ్రాసిన లేఖలన్నిటినీ కాల్చి భస్మంచేసి, నా జ్ఞాపకాల ముద్ర లను మనసులో చెరిపివేయండి. నా మూలంగా మీ హృదయానికి ఏ విధమైన చికాకు కలిగినా క్షమించెయ్యండి. మీ రెప్పుడూ ఆకాశమంత ఆనందంగా, సముద్రమంత సంతోషంగా, చందమా మంత చల్లగా ఉండాలని కోరుకుంటూ...

—మీ, శ్రేయోభిలాషి."

ఉత్తరాన్ని హృదయానికి హత్తుకుని బాధగా కళ్లు మూసుకున్నది సుందరి. 'వద్దు, అటువంటి అఘాయిత్యం ఏమీ చేయబోకు, శ్రేయోభిలాషీ! నువ్వు నిజంగా అటువంటి పనేదైనా చేస్తే జీవితాంతం నేను కుమిలిపోవలసి ఉంటుంది. ఒక్కసారి నువ్వు నాకు కనబడితే నీ మనసు మార్చడంకోసం, నిన్ను మామూలు మనిషిని చేయడం కోసం నా సర్వస్వాన్నీ అర్పిస్తా! ఎంతటి శిక్షనైనా సహిస్తా! భగవాన్, ఒక్కసారి శ్రేయోభిలాషిని నాకు చూపించవూ?' కుర్చీలో కూలిపోయి, కుమిలిపోయింది సుందరి.

* * *

"హృదయాన్ని ప్రమిదగా చేసి,

కంటిపాపలను వత్తులుగా వేసి,

నెత్తుటి నూనెలో,

నిట్టూర్పుల వేడితో,

దీపాలు వెలిగించి,

అనునిత్యమూ, అనుక్షణమూ

నే నారాధించుకొనే దేవతకు —

గౌరవంతో, భక్తితో, ప్రేమతో,

సమర్పించుకొనే — చిన్న కానుక:

—శ్రేయోభిలాషి."

రూమ్ లోపల గడియపెట్టి పోస్ట్‌లో వచ్చిన పేకెట్‌ను విప్పుతుంటే కనబడిన ఎర్ర అక్షరాల కాగితాన్ని చదివి, అక్షరాల వైపు పరీక్షగా చూసింది సుందరి. అవి... రక్తాక్షరాలు! కళ్లు తిరిగినాయి సుందరికి. ప్రపంచం తల్లక్రిందులైనట్లైంది! కెవ్వుమంటూ అచేతనంగా కూలబడి పోయింది సుందరి.

"సుందరీ, సుందరీ!" బయట తలుపులు బాదుతుంటే ఉలిక్కిపడి లేచింది సుందరి. ప్రక్కనే ఉన్న పేకెట్‌ను సూట్‌కేస్‌లో పదిలపరిచి, తలుపులు తీసింది. ఎదురుగా క్లాస్‌మేట్ వసంత!

"అరే, అలాగున్నా వేమిటోయ్, ఇప్పుడే లేచావా ఏమిటి? టైమెంతో తెలుసా? ఒంటి గంట! నడు నడు, ఈ పూట కాలేజీకి సెలవు, అందరం వెళ్లి తిరిగి వచ్చేసేం. మధ్యాహ్నం నుంచి ఎలాగూ క్లాసులు లేవని ఇందిరా వాళ్లూ మాట్నీ ప్రోగ్రామ్ పెట్టేరు. త్వరగా లంచ్ పూర్తిచేసి తయారవు!" — అంటున్న వసంత వైపు ఏమీ అర్థం కానట్టు చూసింది సుందరి.

"అబ్బ, తెమలవోయ్! వెళ్లి భోజనం చేసి రా ముందు!" అంటూ ముందుకు తోసింది వసంత.

"ఇంతకీ ఈ పూట కాలేజీకి సెల వెందుకూ?" అయోమయంగా అడిగింది సుందరి.

"ఆc, ఎవడో కుర్రాడు కాలం మూడి ఆత్మహత్య చేసుకు చచ్చేట్ట! ఏమైతేనేం, మనకి మాట్నీ ఛాన్సు తగిలింది'.

సుందరి గుండెలు ఝల్లుమన్నాయి! "వసంతా, ఎవరతనూ? మన కాలేజీ అబ్బాయేనా? పేరేమిటి? ఎందుకు చచ్చిపోయేడూ? చెప్పు,వసంతా, ప్లీజ్!" భయంతో వణికిపోతూ అడుగుతున్న సుందరి వైపు ఆశ్చర్యంగా చూసింది వసంత.

"ఎవరో పేరు, ఊరు లేని కుర్రాడు! పూర్ స్టూడెంట్ అట! రోజులు గడ వడం కష్టమైగామోసు, ఓ పాతిక నిద్రమాత్రలు మింగి చచ్చిపోయేట్ట! గొడవ వదిలిపోయింది. అత నెవరో చాలా మందికి అసలు తెలీనే తెలియ దుట! ఏం — అదేమిటీ అలా అయిపో తున్నావు? ఊళ్లో పోయినాళ్లందరి కోసం బెంగపెట్టుకుని కూర్చుంటే మనకి రోజులు గడిచినట్టే! ..."

"వసంతా!" గట్టిగా అరిచి, తలుపులు మూసుకొన్నది సుందరి. 'పిచ్చి పిల్ల!' అనుకొంటూ పక్క రూమ్‌లోకి వెళ్లిపోయింది వసంత.

తల బాదుకుంటూ భోరున ఏడ్చింది సుందరి. 'శ్రేయోభిలాషీ! నిజంగా గాని నువ్వేనా ఇలా చచ్చిపోతా? అవును, నువ్వే అయిఉంటావు. నిద్రరావడానికి ఏదో ఉపాయం ఉన్నదని ఆ మధ్య వ్రాసేవు. నిజంగా నువ్వే అయి ఉంటావు. ఎందు కిలా చేసేవు? నేనేం చేసేను? నీ ప్రేమను నీలోనే దాచుకొంటానన్నావు, అయినా నాకుమాత్రం చెప్పుకో గలిగావు కాని, నా స్థితి చూడు. నా బాధను, గుండె ల్లోని రంపపు కోతను ఎవరికి చెప్పు కోను? నీకు చెప్పుకోవాలన్నా వీల్లేకుండా ఇంత క్రూరంగా ఎందుకు శిక్షించావు? శ్రేయోభిలాషీ! చచ్చిపోయిన వ్యక్తి నువ్వు కాకుండా ఉంటే నే నెంతటి అదృష్ట వంతురాల్ని! భగవాన్, చచ్చిపోయిన వ్యక్తి నా ప్రియాతిప్రియమైన శ్రేయోభి లాషి కాడని నా కెలాగైనా తెలియజెయ్. అతని దగ్గిర నుండి మరొక్క ఉత్తరం చేప్పట్టు చెయ్యి, తండ్రీ! ...'

పిచ్చగా జుట్టు పీక్కుంటూ ఏడిచింది సుందరి.

"చీకటి పడింది —

వెన్నెల వచ్చి వెళ్లిపోయింది,

తెల్లవారింది—

సూర్యు డుదయించాడు —

పోస్ట్‌మెన్ వచ్చి వెళ్లిపోయాడు —

మళ్లీ చీకటిపడింది, మళ్లీ తెల్లవారింది,

మళ్లీ పోస్ట్‌మన్ వచ్చాడు,

శ్రేయోభిలాషి ఉత్తరం—మరి రాలేదు!

సుందరి కళ్లనుండి అశ్రువులు

మరి రాలలేదు!" ★

మైసూర్ ! మైసూర్ !!

ఫోటో — వి. వి. రమణారావు

(బెంగుళూరు-25)

